# త్రాగుబోతుఐన భర్త

దీపావళినాటి రాత్రి ఏడయింది! ఎవళ్లో కుర్రకారు వేసిన తారాజువ్వ ఫలితం సంతపేటంతా అంటుకుంది. ఊళ్లో జనమంతా పండుగ ఉత్సాహాన్ని చంపుకుని అటువైపు పడ్డారు. ఎంతగా ఆర్పుదామనుకున్నా మంటలు ప్రపంచలోని అశాంతినీ, అస్వభావపు బానిసత్వాలనీ సహించలేనట్టు నిప్పులుగక్కుతూ లేస్తున్నాయి. అక్కడి యిళ్ళల్లో జనం సామాన్నంతనీ రోడ్లమీదికి, ప్రక్క పొలాల్లోకి తర్లించుకుంటున్నారు.

తక్కిన పేటంతటినించీ విడివడి, ప్రత్యేకస్థానాన్నాక్రమించుకున్న ఒక తాటాకుల యిల్లువుంది. ఎత్తుగా ఉన్న అరుగులమీదినించి ఒకామె ఎర్రనికాంతులు తన మొహం మీద పడుతోంటే, విచార రహితంగా, నిర్మల హృదయంతో ఉన్నట్టు చూస్తోంది.

ఆమె ఫోర్మన్ భార్య – సుశీల. మధ్య వయస్సులో వుంది. నల్లగా వున్నా అందమైనదనే చెప్పొచ్చు...

ఫోర్మన్ యింటికి ప్రమాదంలేదని ఎవరూ అనలేరు. ఎందుకంటే సంతపేట మరోమూల అంటుకుని, గాలివిసురు వల్ల మధ్యన వున్న గుడిసెలనన్నిటినీ తుడిచిపెట్టుకు మంట ఈ మూలకే వొస్తోంది.

సుశీల ఇంత చైతన్య రహితమైనది కావడానికి తగిన కారణాలు లేకపోలేదు. మధ్యాహ్నం వాళ్ళింట్లో జరిగిన సంఘటన విన్న వాళ్ళకి ఆ సంగతి గ్రహించడం కష్టంకాదు.

దేశంలో మద్యపాన నిషేధం అమలులోకి వస్తుందనుకున్నప్పుడు అన్ని గంటల్లోనూ పొందుతూండేవాడు. అలాంటి అతనికి ఆ చట్టం మొహంలో కత్తి వేటుకు నెత్తురుచుక్క లేకుండా చేసింది.

భర్త దురలవాటు తమజీవితాలకి ఎంతగా అంతరాయం కలిగిస్తున్నా, సుశీలపేరు సార్ధకం చేసుకుంటూ బతుక్కొచ్చింది. ఎప్పుడూ  ఎదురాడి ఎరగదు. చట్టం రాకపోతే సుశీల తనజీవితాన్ని పూర్వంలాగే బరువుగా గడుపుతూవుండేదేమో?

"నాయకత్వం పదేళ్ళు ప్రజలకంటె వెనకాల వుంది" అనుకుంటుంది. ఎందుకంటే పదేళ్ళకిందట అనుకున్న చట్టాన్ని ఇంకా అమలులోకి తేలేకపోతున్నది.

మామూలుగా పదిగంటలకి భోజంచేసి ఎక్కడికో ప్రయాణం కాబోయాడు, ఫోర్మన్.

"ఈ వేళ సెలవు అనుకుంటాను"

"అవును"

"మరి, ఎంతవరకు ప్రయాణం"

"క్లబ్‌కి"

సుశీల నిర్ఘాంతపోయింది. పది పదిహేనురోజులయింది. ఈ మధ్య ఆమాటే వినలేదు. దానిలోని అర్థం ఆమెకి తెల్సును. అతను విజయగర్వంతో చూస్తున్నాడు.

"మీకు పుణ్యముంటుంది, ఆపని మానుదురు"

"మూడు రంగులజెండా తీసుకో పోలీసు వుద్యోగమన్నావస్తుంది. ఈ నీతుల్నెప్పుడు నేర్చుకొన్నావ్"

చివరిమాటలు కఠినంగా అన్నాడు. సుశీలమనస్సు గాయపడింది.

"నా మీద వొట్టు. మిమ్మల్ని వెళ్ళనియ్యను"

"తొండ ముదిరిందన్నమాట!" వెళ్ళబోయాడు. సుశీల గుమ్మానికడ్డుగా నించుంది.

"న్యాయంగా తప్పుకో! పండుగపూట..."

"పండుగ కనకనే మిమ్మల్ని బతిమలాడుకునేది".

"గౌరవం ఒకళ్ళిస్తే వొచ్చేదికాదు!" చెయ్యి పట్టుకుని గెంటేడు. నేలమీదపడింది సుశీల. నుదుటికి బలమైన గాయంతగిలింది.కాని ఏడవలేదు. దు:ఖాన్ని దిగమింగుకుంది.

"వెళ్ళండి..." బాధలో అన్నమాటలు ఫోర్మన్ వేసిన తలుపుచప్పుడులో కలిశాయి. ఆ మాటల్లో భారతస్త్రీ అనుభవించే యుగయుగాల బానిసత్వంమీద కసి ధ్వనించడం ఎవరూ గమనించనేలేదు - కాలగర్భంలో కలిసిపోయింది.

మళ్లా సాయింత్రం పై దృశ్యంలోనే సుశీల మనకి కనపడుతుంది.

ఊరి బయట ఆ 'క్లబ్' ఎక్కడో ఆమెకి తెలియలేదు కాని ఆమెకి ఆశ్చర్యమేసిందేమిటంటే ప్రభుత్వాన్ని వీళ్ళెలా అతిక్రమించగలుగుతున్నారా అని? పోలీసుల బాధ తప్పించుకుందుకు వీళ్ళు 'క్లబ్'ని వేరుచోటికి మార్చి వుంటారు. అది ఎక్కడైవుంటుంది! ఆవీధికి... ఆ చివర... అవును, అదే! పోలీసులకి రిపోర్టుయిస్తేనో! మొగుడైతే మాత్రం, న్యాయంకంటేనా?

ఎన్నో ఆలోచనలతో కాలంగడిచి, చీకటిపడింది.

ఇవతలికిరా, అమ్మా అని ఎంతమందో అరవసాగారు. సుశీల మాట్లాడ్లేదు. స్తంభంలా నించునుంది, మంటల్లో ఏదో సత్యాన్ని చూస్తున్నట్టు!

ఇంతలోకి ఒక నెరుసు ఎగిరి వీళ్ళింటిమీద పడితే నడికొప్పు అంటుకుంది.

సుశీల నెరిగిన, ధైర్యంగల ముసలిది ఒకత్తె పరుగెత్తుకువెళ్ళి దూరంగావున్న చెట్టుకిందకి లాక్కొచ్చింది. తర్వాత అందరూ వాళ్ళు పనుల్లో మునిగిపోయారు. సుశీల పక్కగా కాళ్ళులేనిముసిల్ది ఇంకొకత్తె వుంది.

"ఈ ప్రపంచంలో సత్యకాలపు మనుషులకి చోటు లేదు. అందులోనూ కాళ్ళులేని వాళ్ళు బతకడం అనవసరం! నా చిన్నతనంలో ఎంతమందికి చాకిరీచేశానని? నలుగురు కొడుకులూ, ముగ్గురమ్మాయిలూ ఉన్నారు. వాళ్లెవరూ యింత అన్న మన్నా పెట్టరు. నా చాకిరంతా గంగలో కలిసింది. నా కళ్ళు కష్టంలో అరిగిపోయాయి. కాని ఇప్పుడు ఈ చెంబు మిగిలింది. ఈ అగ్ని హెూత్రుడ్ని ముష్టి అడుగు తాను, ప్రాణవిముక్తి నిమ్మని".

"పాపం!" అంది సుశీల అనాలోచితంగా

"నిజంగా! చాలామంది! నా మాట నమ్మరు అంది ముసిల్ది"

"అవును; నే నెరుగుదును" ఆ ముసలమ్మ నసలు చూశైనా ఉండదు – నిజానికి.

"ఇంకా నీలాంటివాళ్ళున్నారు కనుకనే ప్రపంచకం..." ముసిలిది ఏకరువు పెడుతోంది.

"సుశీ..." ఖంగారుతో మంటల్లోంచి నొచ్చాడు ఫోర్మన్. సుశీల కళ్ళు అప్పగించింది.

"నేనొచ్చానులే భయపడకు. నువ్వు క్షేమంగా ఉన్నావుకదా, సామాను..."

"వెళ్ళండి తీయండి" అంది కఠినంగా

"తిరిగి ఆ మంటల్లోకి, వెళ్ళనా?"

"ఊ"

"నిజంగా మనస్ఫూర్తిగా అంటున్నావా? నువ్వు నన్ను ప్రేమించటంలేదూ? నా ప్రాణంమీద నీకు ఆశ లేదూ?"

"లేదు – నా ప్రాణంమీదే లేదు.ప్రేమను గురించి నేను కలైనా కనలేదు.మీ కెప్పుడూ మీ సుఖమే! నాకు దెబ్బలు, తన్నులు, చాకిరి!! మిమ్మల్ని నేను ప్రేమించటం లేదు. నేను నా విధిని నిర్వర్తించుకున్నాను. ఎందుకు ప్రేమించాలి మిమ్మల్ని? దెబ్బలుచాలకా? ప్రాణం మిగిలి వుందనా? వెళ్ళండి, మీ సామాను సంరక్షించుకోండి"

ఫోర్మన్ మంటలమధ్యకి పరుగెత్తాడు. ముసిల్ది కర్రపుచ్చుకుని నన్ను కూడా తీసుకుపో" అని బయలుదేరింది. ఫోర్మస్ మంటలమధ్య చిక్కుకున్నాడు.

"సుశీ! నన్ను ప్రేమించడం లేదుగా" ఇంకా మంటల్లోకి పోయాడు.

సుశీలకు కళ్ళనీళ్లు తిరిగాయి.

"రండి, ప్రేమిస్తున్నాను" సుశీలకి ఆ తాగుబోతు భర్తమీద ప్రేమ కలిగింది. కాని లాభంలేదు. భర్త అప్పుడే మంటలమధ్య చిక్కుకుపోయాడు. తాగుబోతు మరణించాడు!